క్లుప్తంగా

రూ.60 వేల సామగ్రి వితరణ



మందిరానికి అందజేసిన సామగ్రి

పొందూరు: స్థానిక సత్యసాయి మందిరంలో నిత్యనారాయణ సేవకు అవసరమైన వంట సామాన్లను పొలిసెట్టి వెంకట ప్రసాద్, వాణి, అప్పలరాజు, గంగారత్నం గురువారం అందజేశారు. వీటి విలువ రూ. 60 వేలు ఉంటుందని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డీ.రాధాకృష్ణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అఖండనామ సంకీర్తన



చిన్నారులు ప్రదర్శించిన రాధాకృష్ణ వేషధారణ

కొత్తూరు: మండలంలోని సిరుసువాడలో భీష్మ ఏకాదశి వేడుకలు గురువారంతో ముగిశాయి. గ్రామంలోని సాయిరాం మందిరం వద్ద బుధవారం ఉదయం ఆరు నుంచి ప్రారంభించిన అఖండనామ (హరేరామ) సంకీర్తన గురువారం ఉదయం ఆరు గంటల వరకు నిర్వహించారు. పూజలు అందుకున్న జ్యోతిని గ్రామంలోని తీరు విధి నిర్వహించి వంశధార నదిలో నిమజ్జనం చేశారు. అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల రాధాకృష్ణ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

మోడల్ స్కూల్ విద్యార్థి సత్తా



కాంస్య పతకం సాధించిన చంద్రశేఖర్

పాతపట్నం: రాష్ట్ర స్థాయిలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఇటీవల నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 81 కేజీల విభాగంలో పాతపట్నం మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న జి.చంద్రశేఖర్ కాంస్య పతకం సాధించాడని ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం మోడల్ స్కూల్లో చంద్రశేఖర్‌ను సత్కరించారు. జాతీయ స్థాయిలో చంద్రశేఖర్ రాణించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. చంద్రశేఖర్‌ను వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఎస్ఎంఎస్ చైర్మన్ ధనుంజేయ, అధ్యాపకులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని అలుదు పంచాయతీ మాకివలస గ్రామంలోని రామ మందిరంలో సీతారాముల కల్యాణాన్ని గురువారం నిర్వహించారు. మందిర వార్షికోత్సవం పురస్కరించుకుని పురోహితులు పి.ఉమామహేశ్వరరావు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం చేపట్టారు. తొలుత ప్రత్యేక, విశేష పూజలు చేశారు. అనంతరం మందిర ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్ సాగిపల్లి దండాశి, రావాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ టైర్లు, బ్యాటరీ చోరీ



సంఘటన స్థలంలో ఉన్న ట్రాక్టర్

జలుమూరు: కరవంజ పంచాయతీ వెలుసోదకు చెందిన గొల్లంగి రమణారావుకు చెందిన ట్రాక్టర్ టైర్లు, బ్యాటరీ బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్ము (వరి పొలం) చేసిన అనంతరం రాత్రి ట్రాక్టర్‌ను పొలం వద్ద ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్ టైర్లు, బ్యాటరీ విప్పి తీసుకెళ్లిపోయినట్లు తెలిపారు. గురువారం ఉదయం ఎప్పటిలాగే పొలానికి వెళ్లి చూడగా చోరీకి గురైనట్లు గుర్తించానన్నారు. వీటి విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందన్నారు. సమాచారం తెలుసుకున్న శ్రీకాకుళం క్లూస్ టీమ్‌తోపాటు స్థానిక ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ఆమదాలవలస: పార్వతీశంపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- దమ్మున్న ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపిద్దాం
- గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆమదాలవలస: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ ఒకటో వార్డు తిమ్మాపురం, పార్వతీశంపేట గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, దమ్మున్న ముఖ్యమంత్రిని మళ్లీ రానున్న ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకు గానే చూసిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి బీసీలను బ్యాక్ బోన్ క్లాస్‌గా చూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 8 మంది బీసీలకు మంత్రి పదవులు ఇస్తే.. ప్రస్తుత ప్రభుత్వంలో 11 మందికి మంత్రి పదవులు ఇచ్చి బీసీలను గౌరవించారన్నారు. చంద్రబాబు తన పాలనలో ఒక్క బీసీకి కూడా రాజ్యసభ సీటు ఇవ్వలేదని, సీఎం జగన్ హయాంలో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపించారన్నారు. బాబు హయాంలో స్పీకర్ పదవిని కూడా తన సామాజిక వర్గానికి కట్టబెట్టారని, ఇప్పుడు ఆ పదవి కూడా బీసీ తనకు ఇచ్చారని గుర్తుచేసారు. గత 5 ఏళ్ల టీడీపీ పాలనలో బీసీల కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తే.. ఈ ప్రభుత్వం మూడున్నర ఏళ్లలోనే రూ.1.70 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్‌ఫ్లోర్ లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, పార్టీ ముఖ్య నాయకులు బోర చిన్నంనాయుడు, పొన్నాడ చిన్నారావు, సంపతిరావు రామారావు, కిల్లి అప్పలనాయుడు, చంద్రరావు, శిమ్మసత్యనారాయణ, అరుణ్‌కుమార్, కె.రాము, దుంపల శ్యామలరావు, బి.రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పాతపట్నం: ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం-1 గ్రామ సచివాలయ పరిధిలో ఎస్సీ, దిగువ, ఎగువ కంద్ర వీధుల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్ రాసిన లేఖను అందజేశారు. జనగన్న కాలనీలను మంజూరు చేయాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. రెండో విడతలో జగనన్న కాలనీలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ వీధిలో సీసీ రోడ్డు కావాలని పలురువు మహిళల విన్నవించగా.. మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కె.అర్జునుడు, తాతయ్య, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, మండల సలహాదారుడు ఎం.గణపతి, ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, పనుకు మోహన్, జి.రాము, తూలుగు ప్రవీణ్, ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, ఏపీఎం మనోరత్నం, ఎంపీడీఓ సురేష్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, ఈఓ కుర్మారావు, పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాతపట్నం: ఎస్సీ వీధిలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

- తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్



ర్యాలీ నిర్వహిస్తున్న మామిడి శ్రీకాంత్

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అన్ని వర్గాల వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఆయనతోనే సంక్షేమం సాధ్యం అవుతుందని తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. చైర్మన్‌గా కొనసాగింపు ఉత్తర్వులు వచ్చిన సందర్భంగా ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ కిలారి త్రినాథులు యంబరాం గ్రామంలో గురువారం శ్రీకాంత్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు ఎన్నికల ముందు ప్రజలు గుర్తుకు వచ్చారా? అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు ఎందుకు గుర్తుకు రాలేదని శ్రీకాంత్ ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, అధికారం చేపట్టిన తరువాత సంక్షేమ పథకాలు అమలు చేసి వారిని ఆదుకుంటున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. మండల కేంద్రం నుంచి యంబరాం గ్రామం వరకు ర్యాలీగా వెళ్లారు. గేదెల శ్రీనివాసరావు, కిలారి ప్రసాద్, పైల తవిటినాయుడు, బుక్క చంద్రరావు, కిలారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో హనుమంతుపురం గ్రామంలో ప్రధాన రహదారి (సీసీ రోడ్డు) నిర్మాణానికి రూ.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు పక్కా రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మండలంలో పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మోక్షం కలిగిందని, ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతీ గడపకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందించేందుకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ నేతలు మెట్ట ఆనందరావు, తిర్లంగి రామారావు, అంబటి సత్యనారాయణ, గొంటి కృష్ణ, మెండేటి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆర్అండ్‌బీ, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతోపాటు గ్రామీణ రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గురువారం పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ (పీఆర్) ఇంజినీరింగు అధికారులతో సమావేశమయ్యారు. మండలంలోని పలు రోడ్ల అభివృద్ధి కోసం ఆర్అండ్‌బీశాఖ నుంచి ఇప్పటికే రూ.కోటి మంజూరైందన్నారు. రెండో విడతగా మరో ఆరు రోడ్ల మరమ్మతు పనులకు నిధులు మంజూరు కోసం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు అనుమతి కోరామన్నారు. రెండో విడతలో పాతపట్నం-టిక్కలి రోడ్డు తెంబూరు, అంపురం, బడ్డమర్రి, ఎస్.జె.పురం (ఐటీడీఏ రోడ్డు) సుమారు ఆరు కిలో మీటర్ల కోసం రూ.2 కోట్లు, ఏబీ రోడ్డు నుంచి కొమ్మువలస మీదుగా గొట్టిపల్లి (ఎల్.ఎన్.పేట) పీఆర్ రోడ్డు 3.6 కిలో మీటర్లకు రూ.1.40కోట్లు, కొత్తూరు మండలంలోని పీహెచ్ రోడ్డు కుంటిభద్ర, సిరుసువాడ 5.6 కిలో మీటర్లకు రూ.2.40 కోట్లు, పాతపట్నంలోని కిమిడి, రుగడ రోడ్డు కోసం రూ.2.50 కోట్లు, హిరమండలం మండలంలోని గొట్ట నుంచి నివగాం వరకు, బొత్తాడసింగి రోడ్డు కోసం రూ.2.50 కోట్లు, ఎల్.ఎన్.పేట, హిరమండలంలను కలిపే ఏబీ ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రూ.లక్ష వితరణ

నరసన్నపేట: ఉర్లాం గ్రామంలో గల లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి యారబాడుకు చెందిన ఉరిటి గౌరీశంకర్ రూ.లక్ష వితరణ చేశారని ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు గురువారం తెలిపారు. బడ్డవానిపేటకు చెందిన దాసరి యోగీశ్వరరావు తన మొదటి జీతాన్ని రూ.30 వేలు ఆలయ అభివృద్ధికి ఇచ్చినట్లు తెలిపారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

సారవకోట: మండల కేంద్రంలో గురువారం స్థానిక పోలీసులు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనలతో ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, పెట్టకుండా వెళ్తే జరిగే అనర్థాలను గుర్తి తెలియజేశారు.

వాక్సినేషన్, టాగింగ్ లక్ష్యాలు పూర్తిచేయాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా సంయుక్త సంచాలకులు కిశోర్

పాతపట్నం: పశువులు, గొర్రెలు, మేకలకు పి.పి.ఆర్ వ్యాక్సినేషన్, టాగింగ్ లక్ష్యాలను పూర్తిచేయాలని పశు సంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ మంగిపూడి కిశోర్ పశువైద్య సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని కొరసవాడ గ్రామంలో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. పాతపట్నం పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశు వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆర్బీకేల్లో పనిచేస్తున్న ఇన్‌చార్జి తమ గ్రామాల పరిధిలో ఉన్న పశువుల వివరాలు, కృత్రిమ గర్భ ఉత్పత్తికి పనికివచ్చే పశువుల వివరాలు సేకరించాలన్నారు. టీఎంఆర్ దాణాకు కావల్సిన రైతుల పేర్లు ఉండాలన్నారు. జాతీయ కృత్రిమ గర్భ ఉత్పత్తి ఇంజక్షన్ల వివరాలు ఆన్‌లైన్‌లో కచ్చితంగా నమోదు చేయాలన్నారు. పాడి రైతులు పశుగ్రాసాలు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు తీసుకున్న గుణాలమ్మను సత్కరించారు. టెక్కలి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ విజయరాజ్, సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు, వైద్యులు పి.అనిల్ కుమార్, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల ఆర్బీకేల ఇన్‌చార్జిలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఎల్.ఎన్.పేట: పింఛన్ డబ్బులు అందజేస్తున్న గ్రామ సచివాలయ కన్వీనర్, వలంటీర్

ఎల్.ఎన్.పేట: మండలంలోని యంబరాం గ్రామానికి చెందిన వృద్ధుడు లావేటి త్రినాథులు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గతకొద్ది రోజులుగా శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. గురువారం గ్రామ సచివాలయ కన్వీనర్ సర్వేశ్వరరావు, గ్రామ వలంటీర్ రుంకు శ్రీనివాసరావు ఆస్పత్రికి వెళ్లి త్రినాథులుకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు. వైద్య ఖర్చులకు ఉపయోగంగా ఉంటుందని త్రినాథులు తెలిపారు.

ఆమదాలవలస: మున్సిపాల్టీ పరిధి 16వ వార్డుకు చెందిన వృద్ధురాలు పి.లక్ష్మీకాంతం అనారోగ్యం కారణంగా రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు వార్డు వలంటీర్ కె.విజయలక్ష్మి వృద్ధాప్య పింఛన్ అందజేశారు.



ఆమదాలవలస: లక్ష్మీకాంతంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ విజయలక్ష్మి

175 నియోజకవర్గాల్లో విజయం ఖాయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి రెండోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి పదవి అధిష్టించడం ఖాయమని స్పీకర్ తమ్మినేని సీతారాం పునరుద్ఘాటించారు. మండలంలోని రొట్టవలస, సరుబుజ్జిలి ప్రాంతాల్లో 14 సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ మాట్లాడుతూ.. ఏ రాజకీయ పార్టీకైనా నిర్మాణం, నిర్వహించడం చాలా అవసరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు, నాయకులు కలసికట్టుగా గ్రామాల్లో పనిచేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం..

ప్రభుత్వం పెట్టిన పథకాలే విజయానికి శ్రీరామ రక్షని స్పీకర్ తెలిపారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో అందరూ కలసికట్టుగా పనిచేయాలన్నారు. ఆమదాలవలస నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్ల మెజార్టీతో విజయం సాధించి ముఖ్యమంత్రికి గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, సచివాలయాల కో ఆర్డినేటర్ మూడడ్ల రమణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, మహిళా కన్వీనర్ బొడ్డేపల్లి చామంతి, పార్టీ నాయకులు అత్తులూరి రవికాంత్, బొడ్డేపల్లి హరి, ఇల్లాకుల సూర్యప్రకాశరావు, రొట్టవలస సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ పాల్గొన్నారు.

విశాఖ రాజధానితో ఉత్తరాంధ్ర అభివృద్ధి

- ఎమ్మెల్యే రెడ్డిశాంతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: విశాఖ రాజధానితో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వికేంద్రీకరణ నిర్ణయాన్ని తీసుకున్నారని పాతపట్నం ఎమ్మెల్యే ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. గురువారం మండలంలోని గొప్పిలి గ్రామంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వికేంద్రీకరణతో మూడు ప్రాంతాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం రూపురేఖలు మారుతాయన్నారు. ధనిక నగరాల్లో విశాఖ తొమ్మిదో స్థానంతో ఉందన్నారు. విశాఖను రాజధాని చేస్తామంటే ప్రతిపక్షాలకు గుబులెందుకని అన్నారు. గొప్పిలి గ్రామ శివార్లలో బ్రిటీష్ కాలంనాటి రైల్ ఖాణా బ్రిడ్జ్ నిర్మాణం, కంబ్రగడ బస్‌స్టాండ్ నుంచి రైల్ ఖాణా మర్రిచెట్టు వరకు రూ.60 లక్షల నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ పనులతో చిరకాల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గోకర్ణపురం పంచాయతీలోని చినహంస గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, సరస్వతీదేవి, పాఠశాల స్థలదాత బొడ్డపాటి లింగాలు విగ్రహాలను ఆవిష్కరించారు. గొప్పిలి సర్పంచ్ పల్లి జయసుధ, ఎంపీటీసీ కె.ఇందిరాదేవి, ఉప సర్పంచ్ భువన పాత్రో, గోకర్ణపురం సర్పంచ్, రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బైపోతు ఉదయ్ కుమార్, అలికాన మాధవరావు, శేఖరాపురం సర్పంచ్ గణపతి ప్రధాన్, పార్టీ నాయకులు మాలతి జయరాం, చౌదరి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్విత కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న బగాది అన్విత

బూర్జ: మండలంలోని కాళపర్తి గ్రామంలో జరుగుతున్న మట్టచ్చమ్మ పేరంటాలు త్రిరాత్రి జాతర మహోత్సవంలో చిన్నారి బగాది అన్విత చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. హైదరాబాద్‌కు చెందిన తొమ్మిదేళ్ల చిన్నారి అన్విత సొంత గ్రామం కాళపర్తి జాతరలో గురువారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం చూపరులను ఆకట్టుకుంది. జాతర మహోత్సవంలో ఆమె చేసిన నృత్యాల్లో భాగంగా 'రామచంద్రాయ జనక నాయిక..' వంటి గీతాలు అలరించాయి. అన్విత హైదరాబాద్‌లోని కళాక్షేత్రంలో ఇటీవల రెండు ప్రదర్శనలిచ్చి అందరి మన్ననలు అందుకుంది. సుష్మప్రణీత వద్ద శిక్షణ పొందింది. చిన్నారిని గ్రామస్తులు అభినందించారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెరగాలి

- డీఎంహెచ్ఓ మీనాక్షి




నరసన్నపేట: వైద్యులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో అన్ని వసతులు కల్పించామని, అభివృద్ధి పనులు చేపట్టామని, ఇక నుంచి పీహెచ్‌సీల్లో ప్రసవాలు సంఖ్య పెంచాలని డీఎంహెచ్ఓ బి.మీనాక్షి అన్నారు. మండలంలోని ఉర్లాం పీహెచ్‌సీని గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశాలు ఎందుకు నిర్వహించడం లేదని వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. ప్రతీ నెల సలహా సంఘ సమావేశాలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలో రూ.1.75 లక్షల నిధులు ఉన్నాయని, వీటిని సకాలంలో సద్వినియోగం చేయకపోతే వెనక్కి మళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఈ నిధులను అవసరమైన మేరకు వినియోగించాలని సూచించారు. ముఖ ఆధారిత హాజరును పీహెచ్‌సీల్లో అమలు చేసిన తరువాత సేవలు మెరుగుపడ్డాయని, ఓపీ పెరిగిందన్నారు. ఆస్పత్రిలో సిబ్బంది పనితీరును వైద్యులు సుజాతను అడిగి తెలుసుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

ఆమదాలవలస రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా వైద్యాశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. మండలంలో అక్కులపేట గ్రామంలో గల పీహెచ్‌సీ గురువారం తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో రికార్డులను, ప్రసూతి వివరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యాశాఖ పరంగా నిత్యం వైద్య సేవలు అందజేయాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో అన్ని వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసూతి కేసులు పెరగాలని సూచించారు. వైద్యాధికారులు కె.మీనాకుమారి, బి.వసంత ఉన్నారు.

సీనియర్ ఏపీటీఎఫ్ నాయకుడి మృతి





భౌతికకాయంపై ఏపీటీఎఫ్ జెండా (ఇన్‌సెట్లో) దుంపల సన్యాసప్పారావు (ఫైల్)

పొందూరు: సీనియర్ ఏపీటీఎఫ్ నాయకులు, రిటైర్డ్ టీచర్ దుంపల సన్యాసప్పారావు (80) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన స్వగ్రామం తోలాపి. ఈయనకు భార్య విజయలక్ష్మి, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియల్లో ఏపీటీఎఫ్ నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్తులు పెద్ద పాల్గొని నివాళులర్పించారు. మొదటి తరం ఏపీటీఎఫ్ నాయకుల్లో సన్యాసప్పారావు ప్రముఖులు. ఈయన సమితి, మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడిగా గతంలో సేవలందించారు. ప్రభుత్వ జీఓలపై, టీచర్ల సమస్యలపై అపారమైన అనుభవం ఉండటంతో పలువురు ఏపీటీఎఫ్ నాయకులు ఆయనను కలుస్తూ చర్చించేవారు. ఈయన మృతిపట్ల స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పప్పల రమేష్‌కుమార్, పప్పల రాధాకృష్ణ, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కొప్పల భానుమూర్తి, పాండురంగ వరప్రసాద్, సిస్టు అనిల్‌కుమార్, మజ్జి మదన్, బల్ల సుభాష్, మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు రమణరావు తదితరులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.